అక్షరాలా జరిగింది: అభూతకల్పన కాదు

# ఆనాడు భార్య బిక్కమొహం వేసింది

కాలజ్ఞానం సుబ్బారావు

"రాఘవయ్యా! ఓసారి యిలా రా," అన్నాడు ఆఫీసరు. "ఇదో నండి," అంటూ రాఘవయ్య వెంటనే లేచి కుర్చీకి తగిలించిన కోటు తొడుక్కొని కంటద్దాల్ని సవరించుకుని గబగబా యజమాని ముందు హాజరయ్యాడు. "మరేం లేదు, రెండు రోజుల్లో రిపబ్లిక్ డే ఉత్సవాలు జరపాలిగా! అందుగ్గాను సెలవు లిస్తారు. ఆఫీసులో కాగితం తోరణాలు అవంతా అలంకారంగా వుండాలి. జవాన్ల సహాయంతో నువ్వంతా ఏర్పాటుచెయ్యి. పతాకం ఎగురవేసేందుకు సిద్ధం చెయించాలి కూడాను. చూడాలి నీ శక్తి సామర్థ్యాలు" అన్నాడు ఆఫీసరు. "అలాగే నండి," అంటూ రాఘవయ్య చేతులుకట్టుకుని నిల్చునే వున్నాడు. ఆఫీసరువారు కొంతసేపు రాఘవయ్యని చూడలేదు! పాపం నిలుచుండి పోయ్యాడు. ఓ అయిదునిమిషాలకి యజమాని రాఘవయ్యవైపు తిరిగి, "సార్! నిలబెట్టాను. ఇంకేం లేదు. చెప్పాల్సిందంతే. మీ రెళ్లొచ్చు" అన్నాడు. రాఘవయ్య తక్షణం తన సీటు చేరుకున్నాడు.

*　　*　　*

ఆవూరు డిప్యూటీ తాశీల్దార్ వారి కచ్చేరిలో రాఘవయ్య హెడ్ గుమాస్తా. మెట్రిక్ పాస్ కాగానే తండ్రి తనకి గుమాస్తాగిరీ యిప్పించాడు. ఒక్కడే కొడుకైనా ఎక్కువ చదివించేందుకు తనతండ్రి పురోహితు డవటంచాత శక్తి లేకపోయింది. ఆస్తి అసలు లేదు. కొంత కాలానికే తండ్రి గతించాడు. అదృష్టవశాత్తూ అప్పులుమాత్రం మిగల్చలేదు కొడుక్కి. అప్పటికే తన కేమో పెళ్లయిపోయింది. భార్య కాపురానికి వచ్చింది. ఆ కాలం కాబట్టి తనో గుమాస్తాయే అయినా, వచ్చే కాసులతోనే సంసారం కొనసాగిస్తూ వచ్చాడు. సుముహూర్తాన సంసారం ప్రారంభించాడో ఏమో అన్ని టెస్టులూ పాసయ్యాడు. ప్రమోషన్ మాత్రం ఇంకా రాలేదు. అప్పటికి భార్య గర్భం దాల్చడం-ముదుసలి తల్లి యీ లోకం వదలడం ఏకకాలంలో జరిగాయి. ఇంటిచాకిరీ అంతా గర్భిణి అయిన భార్యపై బడింది. పుట్టినింటికి పంపితే తను హోటల్లో భోంచెయ్యాలి. అందుకనే ఊరుకున్నాడు త్వరలో కొడుకుపుట్టాడు. రాఘవయ్యకి వాడి నామకరణం జోరుగా జరిపాడు. అప్పటికి పనిలో చేరి అయిదేండ్లయింది. కొడుకు పుట్టినరోజుకి తను పర్మనెంటయ్యాడు. ఆ సంతోషంతో ఘనంగా విందుచేశాడు మిత్రులకి. రాఘవయ్య కప్పటికి యింట్లో ఆవీ-యివీ తెచ్చే పూచీ పడడంవల్ల ఆఫీసర్ మెప్పుకనీ, ప్రమోషన్కనీ తాను ఎక్కువకాలం వినియోగించ లేక పోతున్నాడు. ఆఫీసుపని రెండు గోడవల మధ్య జరగడం కష్ట మనిపించింది. రెండో కాన్పుకి సిద్ధమయింది భార్య. కూతురుపుట్టిం దీసారి. భార్య సంతోషించింది వెరైటీకి. తనూ సంతోషించాడానాడు. కొన్నాళ్ళకే హెడ్ గుమాస్తా అయ్యాడు. కూతురికి ఆ ఆనందంలో పట్టీ గొలుసులు తెచ్చాడు. కొన్నాళ్లకే కొడుక్కి అక్షరాభ్యాసం చేశాడు రిటైర్ అయ్యేలోగా తప్పక ఆఫీసరవుతానని ధైర్యం ఉండేది. నాలుగుసంవత్సరాలు గడచాయి. మరో కొడుకు పుట్టాడు. మళ్ళీ కాన్పుకి సిద్ధంగా ఉంది భార్య. కమ్యూనల్ జీ. ఓ ముంచుకు వచ్చింది. తనకి క్వాలిఫికేషన్లున్నా, ఛాన్సు లేకుండాపోయింది. హెడ్ గుమాస్తాగానే మరో పదేండ్లు నెట్టాడు. ఇప్పటికింకా మూడేండ్ల సర్వీసుండినా రిటైర్ కావాలనిపిస్తుంది. దేహం కాయకాచిపోయింది. నరాలు బిగుసుకుపోయినై! ఇరవై రెండేడ్లు ప్రభుత్వానికి దేహం అమ్ముడుపోయిందానికి ఫలితం! పరాయిప్రభుత్వం పోయి మన ప్రభుత్వం కూడా వచ్చింది. తనాశించిందంతా నిష్ప్రయోజన

మయ్యేదే కాకుండా ఎక్కువ బాధ్యత నెత్తిన పడ్డాది... అందుకుతోడు తనముందే గుమాస్తాలుగా చేరిన పసివాళ్ళంతా ఆఫీసర్లయి, తన దగ్గరికి పని నేర్చుకోవడాని కొనాడు వచ్చి ప్రాధేయపడినా,- యీనాడు అధికారం చెలాయించడం-కసరడం-పని కాలేదనడం - 'శక్తిలేకుంటే రిటైర్ కారాదా' అనడం- చేస్తున్నారు. 'విధికృత' మని రాఘవయ్య అవన్నీ భరిస్తున్నాడు. లోపలే కుములుతున్నా ఏం చేస్తాడు పాపం?... అప్పటికీ మొదటివాడింకా యింటర్ సీనియర్ చదువుతున్నాడు. అమ్మాయి పెద్దయి కాపురానికి వెళ్ళింది. ఆ పెళ్ళి దైవకృపవల్ల బాగానే జరిగింది. అల్లుడికి వెయ్యిన్నూటపదార్లు పోసినా మంచి సంబంధం! తృప్తి పొందగల్గాడు. రెండోవాడు అయిదోఫారం- రెండో అమ్మాయి, మూడో అబ్బాయి ఇద్దరూ మూడోఫారం చదువుతున్నారు. చేతిలో సంవత్సరం మగపిల్లాడు. వాడికి లివర్ కంప్లయింట్. హార్లిక్స్కి, మందుకే డబ్బు చాలడంలా! అమ్మాయికి పెండ్లియీడు వస్తూంది. ఇదంతా యిట్లా వుండగా, రేషన్ రోజులు రావటంవల్ల సంసారం సాగించడం కూడా కష్టంగానే వుంది. ఆనాటికి అబ్బాయికి పబ్లిక్ పరీక్షలకి ఫీజు పంపడానికి తలప్రాణం తోకకివచ్చింది. కృష్ణయ్య సెట్టి ధర్మమూ అని ఎక్కువ వడ్డీకైనా అప్పు వెంటనే పుట్టింది. సంసారయాత్ర కొనసాగిస్తూనే ఉన్నాడు, సుఖం ఓనాడైనా పొందగలననే ధైర్యంతో. ఆఫీసులో పని దినదినానికి జాస్తి అవుతుండడంవల్లా తనకి దేహంలో పటుత్వము సడలడంవల్లా, యజమాని ఆగ్రహానికి అప్పుడప్పుడు గురి అవుతున్నాడు. ముసలాడనైనా లేకుండా ఆ నిర్దయులు అందరిముందూ తనని కసరడం ఒక్కొక్కసారి రాఘవయ్యకి కండ్లనీళ్ళపర్యంతం తెచ్చేది. ఓపిక ఒక్కబట్టుకోవడం ముందునుంచీ అలవాటే కాబట్టి మామూలుగా నోరువిప్పకుండా వుండిపొయ్యేవాడు. తనక్రింది గుమస్తాలంతా క్రొమాట్స్. చేతగానివాళ్ళు. వ్రాసిందంతా తప్పు. చేసిందంతా చెత్త! ఎన్నని దిద్దడం? విసిగి పోతుండేవాడు. ఆఫీసర్ చల్లగా మాట్లాడితేచాలు, సంతోషం పొందగలిగే స్థితిలో ఉన్నాడు రాఘవయ్య.

ఆనాడు ఆఫీసరు ఆప్యాయంగా పిలిచి నిదానంగా తనని పలకరించడం రాఘవయ్యకి ఉత్సాహం కలిగించింది. ఈనాటికి ఆ ఆఫీసరైనా తనని అర్థం చేసుకున్నాడని సంతోషించాడు. అంతవరకూ ఏదోవిధంగా వచ్చిన ఆఫీసర్లందరూ తనని పనిలో చాలా చచ్చని వ్రాసిపొయ్యారు. రాఘవయ్య యీ ఆఫీసరు కటాక్షాన్ని పూర్తిగా పొందాలని "ఏవిధంగా అలంకరించాలా ఆఫీసు" అని కొంచెంసేపు యోచించాడు. 'ఇంటికి వెళ్ళి రేపటిలోగా ఆలోచిద్దాం' అని పనిలో పడ్డాడు మళ్ళా. ఆ రాత్రికి నిద్ర సరిగా పట్టలేదు. పడక మీద దొర్లుతున్నాడు- ఇంతలో చంటి పిల్లాడేడ్చాడు. పని ముగించుకవచ్చింది భార్యకూడా. పిల్లాణ్ణి సముదాయిస్తూ, "ఏమండీ! ఎంతచెప్పినా పట్టించుకోరే మీరు? హార్లిక్సయిపోయింది. లేకపోతే ఎలాగ? మనం పస్తున్నా బిడ్డగతేంకావాలి? ఆఁ ఇంతకూ రేపటికేం చెయ్యాలో తెలీడంలా! ఉండే గోధుమ పిండిని రొట్టెలుకాల్చి తినాల్సిందే. కాస్త ఎక్కడైనా చూడాలి. ఇదిగో చెప్పేశాను," అంటూ వెళ్ళిపోయింది. రాఘవయ్యకి ఇదేమీ చెవికెక్కలా! రేపు రంగు కాగితాల్ని తెప్పించి కత్తిరింపించి తోరణాల్ని కట్టి ఆఫీసులో అష్టదిక్కులా కట్టాలనే అనుకుంటూ కన్ను మూశాడు!

ఆఫీసర్ గారిని డబ్బు అడిగితే బావుండదని, నెలాఖరున వేశేగా యీ ఖర్చు బిల్లు వేయించొచ్చని, అనుకొని రాఘవయ్య ఓ అయిదు రూపాయ లెక్కడ్నుంచో అప్పు తెచ్చాడు. జవాన్లని పిలిపించి తోరణాలు బలంగా తయారు చేయింపచేశాడు. క్రింది గుమాస్తాలూ-తనూ- బెంచీలు, కుర్చీలు సవరించారు. ఆఫీసు ఆవరణంలో చెత్తలేకుండా ఊడిపించాడు. మధ్యాహ్నమైనా, తెల్లారి కాఫీమాత్రమే త్రాగినా, భోజనం సంగతే మరచాడు. ఆకలికూడా కలగలా! సాయంత్రం పనయ్యాక పట్టరాని ఆనందంతో యింటికి వచ్చాడు. భార్య పాపం కాచుకొని ఉంది. రొట్టెలు తిని బిడ్డలంతా స్కూలుకి వెళ్ళారానాడు. రాఘవయ్య తనూ రొట్టెలు తిన్నాడు. మళ్ళా ఆఫీసుకి వెళ్ళాలనీ ఆఫీసర్ వారి ఉత్తరువనీ, రాత్రికి బహుశా అక్కడే పడుకోవచ్చుననీ చెప్పి, భార్య ఏమో చెప్తుంటే

తింటానికికూడా ఓపిక లేక వెళ్ళాడు తొందరగా. పతాకారోహణానికి స్తంభం నాటింప చేశాడు. అందుకూ కూలీకూడా తనేయిచ్చాడు. గుమాస్తాలకి కాఫీ యిప్పించాడు. ఇంకా అర్థరూపాయి మిగిలుంటే (పదిగంటల రాత్రి) జవాన్లు ఇంటికెళ్ళేముందు వాళ్ళ చేతుల్లో పెట్టాడు. వాళ్ళ తృప్తి పొందాలనే రాఘవయ్య అభిమతం. చాలా అలసి వుంటంవల్ల అక్కడే బెంచీపై పడుకున్నాడు. తెల్లారి రిపబ్లిక్ దినం ఆయె; కోడి కూయడంతో లేచాడు. రమ్మన్న తోటి గుమాస్తాల్లో ఒక్కడూ రాలా అప్పటికి. 'పోనీలే! చీవాట్లు తింటారులే!' అనుకున్నాడు. తను బావిదగ్గరి కెళ్ళి దంత ధావనం చేసుకున్నాడు. మిగతా కాలకృత్యాలు ముగించుకున్నాడు. ఇంటికి వెళ్ళి కాఫీ తాగాడు. భార్య, "వంట సంగతేమ"ని హెచ్చరిస్తే, "ఎట్లాగో చూడు. అర్జంటుగా వెళ్ళాలం"టూ స్నానం చేసి చినిగిపోయిన చొక్కాపై తెలియకుండా కోటు వేసుకొని ఖద్దరు పైపంచ పాతది పెట్టి అతుగుల చిమ్మటలు కొట్టిపడివుంటే పైన వేసుకొని బయల్దేరాడు. ఇంటి సంగతే గమనానికి రాలా! తను వెళ్ళేప్పటికి అందరూ వచ్చారు. ఆఫీసరు యింకా రాలేదు. ఆయన వెంటనే వచ్చారు. పతాకారోహణం జరిగింది. యజమాని ఎగరవేసారు జాతీయ పతాకాన్ని. గుమాస్తాల్ని సంబోధిస్తూ, 'లంచం, అన్యాయం' అనేవి ప్రభుత్వోద్యోగులు అలవరచుకోరాదని గంభీరోపన్యాసం చేస్తూ, ఇండియా ప్రజా రాజ్యం అయినందుకు సంతోషం తెలియచేశాడు. రాఘవయ్యని ప్రత్యేకంగా అభినందించాడు. ఆ ఉత్సవం ముగిసింది. రాఘవయ్యని పిలిచి ఆఫీసరు కూచోబెట్టి మాట్లాడుతున్నా డవతలకూడా. రాఘవయ్యకి ముఖం గంపెడంతైంది. తను మాటనిలబెట్టుకొన్నదానికి గర్వపడ్డాడు. ఆఫీసరు "రాఘవయ్యా! ఎంత ఖర్చయిందేం?" అంటే, "ఆఁ ఫర్వాలేదు లెండి! ఎంతయినేం. ఐదులోగానే. నేను ఆవిషయంగా ఏమీ శ్రమపళ్ళేదు లెండి" అని ఆఫీసరుని తృప్తిపరచేందుకన్నాడు. నిజంగా రాఘవయ్యకి అన్నాడైదు రూపాయలు ఖర్చు చెయ్యడం దుబరాగా అగుపళ్ళే. "రాఘవయ్యా నీవు తగ్గ శ్రమ తీసికోకుంటే యీనా హుషారుగా జరిగేదికాదు. తప్పక నీకు రెడ్డుమార్కు ఇస్తాను. మన కర్తవ్యం గుర్తించి పని త్వరగా అయ్యేట్టు చూడాలి" అని యజమాని అంటే ఉప్పొంగిపోతూ రాఘవయ్య "అట్లాగేనండి!" అని మాత్రం అనగలిగాడు. ఆ ఆఫీసరు వెళ్ళాక తను చేసిన ఘనకార్యం, తనకందిన ప్రశంస భార్యకి చెబుదామని పోయాడింటికి. వరండాలో పోస్టుమాన్ వేసి వెళ్ళాడు కాబోలు కార్డు పడివుంది. చూస్తే కొడుకు వ్రాసాడు. అవసరంగా పది రూపాయలు కావాలట!! వంటింట్లోకి వెళ్తే భార్య చీరచెరగు పరుచుకొని చంటివాడితో పండుకొంది. రాఘవయ్యని చూచి లేచింది. అప్పటికే ఒంటిగంట కావచ్చింది. పిల్లలు బడి ఊరేగింపులకి పొట్టలు మాడ్చుకునే పోయ్యారు. అప్పటికి వంట ప్రయత్నం లేని దానికి కారణం యోచించాడు. రాఘవయ్యకి జ్ఞాపకానికొచ్చాయి, నిన్నటి భార్య మాటలు, బియ్యం లేవని. అయ్యో! ఆ అయిదురూపాయల్లో చిల్లిగవ్వయినా మిగల్చలేదు. అయితే అయిందని ఒకవైపు ఆనాడు గడపడం ఎలా? కాఫీ పాత్రలుకూడ తెల్లారివి, అట్లాగేపడివుండినై! బిడ్డ నిద్రపోలేదుయ్యాల్లో భార్య, పండబెట్టి వచ్చింది. రాఘవయ్యకి బుర్రలో రెండు ప్రతిపక్షాలు పోరాడసాగాయి. ఎవర్నడిగేది డబ్బు? ఎవరిస్తారు నెలాఖరున? రిపబ్లిక్ దినం వస్తే! పిల్లలో-త్వరలో ఆకలి మంటల కడుపులతో వస్తారు! ఊఁ హూఁ, రాఘవయ్యకేమీ పాలుపోలా! వస్తుండినా తనకి ఆనాడు సంతృప్తి కలిగింది. మళ్ళీ మళ్ళీ తలుచుకున్నాడు రెండు రోజులుగా. పడిన పాట్లకి కలిగిన ఫలితాన్ని భార్యకి ఉండబట్టలేక, తన అప్పటిస్థితి క్షణం మరచి, చెప్పాడు. భార్య చిక్కమొహం వేసింది.